క్లుప్తంగా

ఏళ్లుగా తిరుగుతున్నా ప్రయోజనమేదీ..?



మాట్లాడుతున్న సీతారావమ్మ

నెల్లూరు(దర్గామిట్ట): వారసత్వంగా సంక్రమించిన 23 ఎకరాల పొలాన్ని ఆన్‌లైన్ చేయించుకునేందుకు కలెక్టరేట్ చుట్టూ ఏళ్లుగా తిరుగుతున్నా, పట్టించుకునే నాథుడే లేరని వృద్ధురాలు సోమవారం ఆవేదన వ్యక్తం చేశారు. వివరాలు.. లింగసముద్రం మండలం తిమ్మారెడ్డిపాళేనికి చెందిన సీతారావమ్మకు సంబంధించిన 23.6 ఎకరాల భూమి వారి తాత పేరిట ఆన్‌లైన్లో ఉంది. దీన్ని తన పేరిట మార్చేందుకు కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నా, ఎవరూ పట్టించుకోవడంలేదని ఆరోపించారు. రెవెన్యూ వారితో కుమ్మక్కై కొందరు అధికారులు వేరే వారికి విక్రయించారని తెలిసిందన్నారు. కాగా ఈ ఘటనపై సమగ్ర నివేదికను అందజేయాలని అక్కడి అధికారులను డీపీఓ ఆదేశించారు.

వరద బాధితులకు విరాళం



నెల్లూరు (టౌన్): విజయవాడ వరద బాధితుల సహాయార్థం అపస్మా సర్వేపల్లి నియోజకవర్గ నేతలు రూ.3,92,371 మొత్తాన్ని సేకరించారు. ఈ క్రమంలో చెక్కును అపస్మా జిల్లా అధ్యక్షుడు శ్రీధర్, కోశాధికారి కృష్ణారావుకు నగరంలో సోమవారం అందజేశారు. అపస్మా సర్వేపల్లి నియోజకవర్గ అధ్యక్షుడు సుబ్బరాయుడు, కోశాధికారి చంద్రబాబు, గౌరవాధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి, సురేష్ పాల్గొన్నారు.

ఈఓ బాధ్యతల స్వీకరణ



నెల్లూరు(బృందావనం): సంతపేటలోని ఆంజనేయస్వామి దేవస్థాన ఈఓగా రఘురామయ్య బాధ్యతలను సోమవారం స్వీకరించారు. గుంటూరు జిల్లా పొన్నూరు మండలం కొండముది గ్రూప్ దేవస్థానాల ఈఓగా విధులు నిర్వర్తిస్తున్న ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. కృష్ణ చరిత మానస ప్రచార మండలి నిర్వాహకుడు కొండేటి పెంచలయ్య సత్కరించారు. దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ చందోలు సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త సర్కిళ్లకు జిల్లా అధికారుల సర్దుబాటు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఎస్పీడీసీఎల్ పరిధిలో కొత్త సర్కిళ్లు మంగళవారం ప్రారంభంకానున్నాయి. అయితే వీటికి అదనంగా విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బందిని నియమించకుండా, పాత సర్కిళ్లలో పనిచేస్తున్న వారినే సర్దుబాటు చేశారు. ఈ క్రమంలో జిల్లా అధికారుల హోదాను మార్చి అక్కడికి బదిలీ చేశారు.

రౌడీషీటర్‌పై హత్యాయత్నం

నెల్లూరు(క్రైమ్): రౌడీషీటర్‌పై హత్యాయత్నానికి పాల్పడిన ఘటనపై సంతపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. బోడిగాడితోటకు చెందిన ఆర్ముగం భార్య రైల్లో భిక్షాటన చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అదే ప్రాంతానికి చెందిన ఆకాష్ భార్య సైతం భిక్షాటన చేసేవారు. ఈ క్రమంలో వీరి మధ్య ఇటీవల ఘర్షణ చోటుచేసుకోగా, ఆర్ముగంపై ఆకాష్ చేయిచేసుకున్నారు. ఈ తరుణంలో ఆర్ముగం తన స్నేహితుడైన తడికలబజార్ సెంటర్‌కు చెందిన రౌడీషీటర్ ప్రణయ్‌తో సీసీఎస్ పోలీస్‌స్టేషన్ సమీపంలో ఆదివారం అర్ధరాత్రి మాట్లాడసాగారు. ఈ క్రమంలో ఆకాష్, పెంచలయ్య, సాయికుమార్, రాము ఆటోలో అక్కడికి చేరుకొని వారిపై రాళ్లతో దాడి చేశారు. దీంతో వారు పరుగులు తీయగా, నిందితులు వెంబడించి కత్తితో ప్రణయ్‌పై దాడి చేసి పరారయ్యారు. చికిత్స నిమిత్తం జీజీహెచ్‌లో చేర్పించారు. ఫిర్యాదు మేరకు నిందితులపై హత్యాయత్నం కేసును పోలీసులు నమోదు చేశారు.

పూర్తి స్థాయిలో విచారణ జరపాలి



మాట్లాడుతున్న బీజేపీ నేతలు

నెల్లూరు(బారకాసు): తిరుమల లడ్డూ మహా ప్రసాదంలో కల్తీ నెయ్యిని వాడారంటూ వస్తున్న ఆరోపణలపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి బాధ్యులపై చర్యలు చేపట్టాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు భరత్‌కుమార్ యాదవ్ పేర్కొన్నారు. మినీబైపాస్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో సోమవారం ఆయన మాట్లాడారు. రానున్న రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. నేతలు మిడతల రమేష్, రాజేశ్వరి, రాజేష్, అశోక్, ప్రవీణ్‌కుమార్, గిరికుమార్‌గౌడ్, నారాయణ, సుబ్బారెడ్డి, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి మహాప్రభో



అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ తదితరులు

- కలెక్టరేట్లో ప్రజాసమస్యల పరిష్కార వేదిక
- మొత్తం 330 అర్జీల సమర్పణ

నెల్లూరు(దర్గామిట్ట): కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను కలెక్టర్ ఆనంద్ నేతృత్వంలో సోమవారం నిర్వహించారు. వివిధ సమస్యలపై అర్జీలను అందజేసేందుకుగానూ జిల్లా నలుమూలల నుంచి భారీగా తరలివచ్చారు. మొత్తం 330 అర్జీలు అందాయి. జేసీ కార్తీక్, డీఆర్వో లవన్న, జెడ్పీ సీఈఓ ఖాదర్‌బాషా, డీపీఓ సుస్మితారెడ్డి పాల్గొన్నారు.

➡ సైదాపురం మండలం జోగిపల్లిలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములను పేదలకు అందజేయాలని ఏఐకేఎమ్మెస్ జిల్లా అధ్యక్షుడు పోలయ్య కోరారు. సర్వే నంబర్ 51 – 1లో 8.8 ఎకరాలను గ్రామానికి చెందిన వ్యక్తి ఆక్రమించి రెవెన్యూ అధికారులను మభ్యపెట్టి కుటుంబీకుల పేరుతో మార్చుకున్నారని ఆరోపించారు.

➡ ముత్తుకూరు మండలం సీవీఆర్ మధురానగర్ గ్రామపెద్దలు తమను గ్రామం నుంచి బహిష్కరించారంటూ పది కుటుంబాల వారు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు.

➡ ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం ఎదుట రాజీవ్‌గాంధీ విగ్రహ కూడలి వద్ద స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలని కనకట్ల రఘురామ్ ముదిరాజ్ కోరారు. స్టేడియంలో రోజూ రెండు వేల మంది వరకు వాకింగ్ చేస్తుంటారని, వచ్చేటప్పుడు తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు.

స్తంభించిన ఆన్‌లైన్

కలెక్టరేట్లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆన్‌లైన్ వ్యవస్థ స్తంభించింది. ఈ పరిణామంతో అక్కడికి వచ్చిన వారు అయోమయానికి గురయ్యారు. అర్జీలు తెచ్చిన వారికి టోకెన్ నంబర్‌ను ఇచ్చి నమోదు లేకుండానే సమావేశ మందిరంలోకి పంపారు. కాగా ఈ విషయమై కలెక్టరేట్ పరిపాలనాధికారి విజయ్‌కుమార్‌ను సంప్రదించగా, ఇంటర్నెట్ సమస్యతో ఈ పరిస్థితి ఏర్పడిందని, అర్జీలను స్వీకరించి ఆ తర్వాత ఆన్‌లైన్ చేస్తామని బదులిచ్చారు.

ఎమ్మెల్సీకి అభినందనలు



నెల్లూరు(బారకాసు): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు సిటీ నియోజకవర్గ సమన్వయకర్తగా నియమితులైన ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డికి పలువురు పార్టీ నేతలు, కార్యకర్తలు అభినందనలను సోమవారం తెలియజేశారు. నగరంలోని 3, 52వ డివిజన్లకు చెందిన పార్టీ నేతలు, కార్యకర్తలు ఆయన్ను కలిసి పుష్పగుచ్ఛాలను అందజేశారు.

టీబీ నివారణకు కృషి



సమావేశానికి హాజరైన సిబ్బంది

నెల్లూరు(అర్బన్): జిల్లాలో టీబీని పూర్తిస్థాయిలో నివారించేందుకు సిబ్బంది కృషి చేయాలని జిల్లా టీబీ, కుష్ఠు నివారణాధికారి, ఏడీఎంహెచ్ఓ ఖాదర్‌వలీ కోరారు. బీవీనగర్‌లోని డేమియెన్ ఫౌండేషన్ ట్రస్ట్ కార్యాలయంలో టీబీ నివారణ వైద్య సిబ్బందితో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసును గుర్తించిన మొదలుకొని పూర్తి స్థాయిలో నయమయ్యేంత వరకు మందులను పక్కాగా వేసుకునేలా సిబ్బంది కృషి చేయాలని సూచించారు. వయోజనులకు వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

సమస్యలను హెల్ప్ లైన్‌కు తెలియజేయండి



అర్జీలను స్వీకరిస్తున్న సూర్యతేజ

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలోని సమస్యలను హెల్ప్ లైన్‌కు ఫోన్ ద్వారా తెలియజేస్తే తక్షణమే స్పందించి పరిష్కారానికి కృషి చేస్తామని కమిషనర్ సూర్యతేజ పేర్కొన్నారు. కార్పొరేషన్ కార్యాలయ ఆవరణలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడారు. నిర్ణీత సమయంలోపు అర్జీలకు పరిష్కార మార్గాన్ని చూపాలని సూచించారు. ప్రజలు తమ సమస్యలను 94940 18118కు వాట్సాప్ లేదా 0861 – 2356777, 2316777 హెల్ప్ లైన్ నంబర్లకు ఉదయం ఆరు నుంచి సాయంత్రం ఆరులోపు తెలియజేయాలని కోరారు. ఈ నంబర్లను ప్రజలకు తెలియజేసేలా ప్రభుత్వ కార్యాలయాలు, కూడళ్లు, సచివాలయ భవనాల్లో ప్రదర్శించాలని ఆదేశించారు. కాగా వివిధ సమస్యలపై 31 అర్జీలను ప్రజలు సమర్పించారు. అదనపు కమిషనర్ శర్మద, హెల్త్ ఆఫీసర్ చైతన్య, మేనేజర్ ఇనాయతుల్లా తదితరులు పాల్గొన్నారు.

మందుబాబుల అసహనం

నెల్లూరు(క్రైమ్): నూతన మద్యం పాలసీ అమల్లో జాప్యం జరుగుతుండటం.. ప్రభుత్వ దుకాణాల్లో మద్యం అందుబాటులో లేకపోవడంతో మందుబాబుల్లో అసహనం వ్యక్తమవుతోంది. ప్రభుత్వ మద్యం దుకాణాల స్థానంలో ప్రైవేట్ దుకాణాల ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. అక్టోబర్ ఒకటి నుంచి నూతన పాలసీని అమల్లోకి తీసుకొస్తామని, అన్ని బ్రాండ్లను అందుబాటులో ఉంచుతామని ప్రకటించింది. దీంతో ఎక్సైజ్ అధికారులు ప్రభుత్వ మద్యం దుకాణాల్లో నిల్వలను నామమాత్రంగా ఉంచారు. పలు దుకాణాల్లో అందుబాటులో లేకపోవడం, బార్లలో అధిక ధరలతో మందుబాబుల్లో అసహనం నెలకొంది. నూతన పాలసీని సోమవారం రాత్రి వరకు విడుదల చేయకపోడంతో ప్రభుత్వ మద్యం దుకాణాలే కొనసాగనున్నాయి. ప్రైవేట్ దుకాణాల ఏర్పాటు ఆలస్యం కానుండటంతో అప్పటి వరకు మద్యాన్ని అందుబాటులో ఉండేలా చూడాలని ఎక్సైజ్ అధికారులను కోరుతున్నారు.

ఉద్యోగుల్లో ఆందోళన

ప్రైవేట్ దుకాణాల ఏర్పాటుకు ప్రభుత్వం పచ్చజెండా ఊపడంతో ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న సిబ్బందిలో ఆందోళన నెలకొంది. 2019లో అధికారంలోకి వచ్చిన అనంతరం ప్రభుత్వ మద్యం దుకాణాలను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇంటర్వ్యూలను నిర్వహించి నిరుద్యోగులకు ఉపాధి కల్పించింది. జిల్లాలోని 193 ప్రభుత్వ మద్యం దుకాణాల్లో 193 మంది సూపర్‌వైజర్లు, 386 మంది సేల్స్‌మెన్లు, 213 మంది వాచ్‌మెన్లు విధులు నిర్వర్తిస్తున్నారు. నూతన మద్యం పాలసీతో వీరందరూ వీధిన పడనున్నారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని వేడుకున్నా స్పష్టమైన హామీ లభించలేదు. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని వారు కోరుతున్నారు.

ఆట్యా - పాట్యా జట్ల ఎంపిక నేడు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): సబ్ జూనియర్స్ బాలబాలికల ఆట్యా – పాట్యా జిల్లా జట్లను నవాబుపేటలోని బీవీఎస్ నగరపాలక సంస్థ బాలికోన్నత పాఠశాలలో మంగళవారం ఉదయం పదికి ఎంపిక చేయనున్నామని అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కృష్ణవేణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారులతో జిల్లా జట్లు బీవీఎస్ నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో అక్టోబర్ ఐదు, ఆరో తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నాయని చెప్పారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు ఆధార్ కార్డు, స్టడీ సర్టిఫికెట్‌ను తప్పక తీసుకురావాలని కోరారు. వివరాలకు 94935 82143, 99661 91956 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

సైబర్ మోసంపై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): వ్యక్తి ఖాతాలోని నగదును కాజేసిన ఘటనపై చిన్నబజార్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. ఫతేఖాన్‌పేటలోని సకిలంవారి వీధికి చెందిన పురుషోత్తం శ్రీహరినగర్‌లోని ఓ డెవలపర్స్ కంపెనీలో అకౌంటెంట్‌గా పనిచేస్తున్నారు. అదనంగా డబ్బులు సంపాదించేందుకు వివరాలు పంపాలని ఆయన వాట్సాప్‌కు మెసేజ్ వచ్చింది. దీంతో అందులో తన వివరాలను పొందుపర్చారు. కొద్దిసేపటికే అతని బ్యాంక్ ఖాతాలోని రూ.1.45 లక్షలను సైబర్ నేరగాళ్లు కాజేశారు. దీంతో సైబర్ క్రైమ్ కంట్రోల్ సెల్‌కు బాధితుడు తక్షణమే ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు కేసు నమోదు చేశారు.

ఘన సన్మానం



నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని 54వ డివిజన్ జనార్దన్‌రెడ్డికాలనీలో గల గుండాలమ్మ ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలిగా విధులు నిర్వర్తిస్తూ ఉద్యోగ విరమణ పొందిన సరోజినీదేవిని సోమవారం సత్కరించారు. ఎంఈఓ అహ్మద్, మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సంగీత విభావరి

నెల్లూరు(బృందావనం): నటుడు నందమూరి బాలకృష్ణ సినీ స్వర్ణోత్సవ సంబరాలను నగరంలోని పురమందిరంలో సృజన సాహిత్య, సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు దగ్గుపాటి రాధాకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. సంగీత విభావరి, ఔత్సాహిక కళాకారులతో డ్యాన్స్‌లను ఏర్పాటు చేశారు. విజయ, వేణుగోపాల్, పెంచలనాయుడు, రియాజ్‌బాషా, సుజాతరెడ్డి, శ్యామ్‌ధన్, ఆర్కాట్ కుమారి, నాగేశ్వరమ్మ, జయలక్ష్మి, జ్యోతిబాబూరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మూడు నుంచి శరన్నవరాత్రి మహోత్సవాలు



ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ

నెల్లూరు(బృందావనం): కోదండరామపురంలోని మహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల మూడు నుంచి 12 వరకు శరన్నవరాత్రి మహోత్సవాలను నిర్వహించనున్నామని దేవస్థాన పాలకమండలి చైర్మన్ నరసింహం తెలిపారు. అమ్మవారి సన్నిధిలో ఆహ్వాన పత్రికలను పాలకమండలి సభ్యులతో కలిసి సోమవారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. అమ్మవారు రోజూ విశేషాలంకారాల్లో దర్శనమివ్వనున్నారని వివరించారు. భక్తులు తరలిరావాలని కోరారు. పాలకమండలి సభ్యులు వాసిపల్లి నారాయణరెడ్డి, నూతేటి వెంకటేశ్వర్లు, పత్తి శ్రీనివాసులు, కాటేపల్లి వెంకటరమణయ్య, వీరరాఘవులు, దామెర చంద్రమౌళి, వెంకటసుబ్బయ్యనాయుడు, శ్రీనివాసులురెడ్డి, గోవిందరాజులు, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్య సాధనకు సమష్టి కృషి అవసరం

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలో మైక్రో ఇరిగేషన్ ద్వారా సాధించాల్సిన లక్ష్యాలను చేరుకునేందుకు అధికారులు సమష్టిగా కృషి చేయాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. రెవెన్యూ ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్లు, మ్యుటేషన్లు, స్వచ్ఛత హీ సేవ, మైక్రో ఇరిగేషన్ లక్ష్య సాధన తదితర అంశాలపై కలెక్టరేట్లోని శంకరన్ హాల్ నుంచి సబ్ కలెక్టర్లు, ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, తహసీల్దార్లతో సోమవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. జిల్లాలో మైక్రో ఇరిగేషన్ ద్వారా 10,500 హెక్టార్లను లక్ష్యంగా నిర్దేశించామని, ఇందులో భాగంగా కంపెనీ ప్రతినిధులు క్షేత్రస్థాయిలో ప్రాథమిక తనిఖీ చేపట్టేందుకు వీలుగా అన్ని మండలాలకు షెడ్యూల్‌ను రూపొందించారని చెప్పారు. రెవెన్యూ, ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్ల మంజూరు, మ్యుటేషన్లపై తహసీల్దార్లు దృష్టి సారించాలని సూచించారు. ఎలాంటి కారణాల్లేకుండా దరఖాస్తులను తిరస్కరించొద్దని కోరారు. ఎలాంటి ఆధారాల్లేకుండా ఉన్న ఎస్టీలకు జనన ధ్రువీకరణ పత్రాలు, ఆధార్‌కార్డులను మంజూరు చేయాలని ఆదేశించారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్లను మొదటి రోజే 95 శాతానికిపైగా పంపిణీ చేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు. జేసీ కార్తీక్, డీఆర్వో లవన్న, జెడ్పీ సీఈఓ ఖాదర్‌బాషా, ఏపీఎంఐపీ పీడీ శ్రీనివాసులు, జిల్లా పంచాయతీ అధికారి సుస్మిత, హౌసింగ్ పీడీ వేణుగోపాల్, ఐటీడీఏ పీఓ పరిమళ తదితరులు పాల్గొన్నారు.

14 నుంచి దివ్యాంగుల అసెస్మెంట్ క్యాంపులు

జిల్లాలోని మండల కేంద్రాల్లో దివ్యాంగుల అసెస్మెంట్ క్యాంపులను ఈ నెల 14 నుంచి నిర్వహించాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. దివ్యాంగుల నైపుణ్యాభివృద్ధి, సాధికారత, పునరావాస కల్పనపై సమ్మిళిత కేంద్ర ప్రతినిధులు, అధికారులతో కలెక్టరేట్లోని తన చాంబర్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వివిధ పరికరాల కోసం దివ్యాంగుల నుంచి దరఖాస్తులను స్వీకరించి అవసరమైన వారికి అందజేయాలని సూచించారు. ఆయా మండలాల్లోని ఎంపీడీఓ కార్యాలయాల్లో నిర్వహించే సదస్సుల వివరాలను ముందుగానే తెలియజేయాలని కోరారు. డీఆర్వో లవన్న, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఏడీ వినయ్‌కుమార్, డీఎంహెచ్ఓ పెంచలయ్య, జెడ్పీ సీఈఓ ఖాదర్‌బాషా, సీఆర్సీ కేంద్ర డైరెక్టర్ మనోజ్‌కుమార్, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పోటీలు



సర్టిఫికెట్లను అందుకున్న విజేతలు

నెల్లూరు (టౌన్): స్వర్ణాంధ్ర – 2047 సాధనలో భాగంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఆరు నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు జిల్లా స్థాయి వ్యాసరచన, వక్తృత్వ పోటీలను దర్గామిట్టలోని జెడ్పీ హైస్కూల్లో సోమవారం నిర్వహించారు. అనంతరం విజేతలకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరు పాల్గొననున్నారు. నెల్లూరు డిప్యూటీ డీఈఓ లక్ష్మీప్రసన్న, ఎంఈఓలు మురళీధర్, అబ్దుల్ హమీద్, సమగ్రశిక్ష ఏపీఓ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

టేబుల్ టెన్నిస్ పోటీలకు 'రత్నం' విద్యార్థులు



నెల్లూరు (టౌన్): రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు రత్నం విద్యార్థులు సూర్యజశ్వంత్, వాసవ్య, చిరుహాస్, వైశాంత్, నవీన్ కార్తీక్ ఎంపికయ్యారని విద్యాసంస్థల జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు తెలిపారు. పాఠశాలలో విద్యార్థులను సోమవారం అభినందించిన అనంతరం ఆయన మాట్లాడారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించిన పోటీల్లో అండర్ – 14 విభాగంలో వీరు గెలుపొందారని చెప్పారు. మేనేజర్ అజయ్‌సింగ్, ప్రిన్సిపల్ మణిమాల పాల్గొన్నారు.

బలిజ విద్యార్థులకు పురస్కారాలు

నెల్లూరు (టౌన్): గత విద్యాసంవత్సరంలో పదో తరగతిలో 550కు పైగా మార్కులు సాధించిన పేద, తల్లిదండ్రుల్లేని బలిజ విద్యార్థులకు ఆర్థిక పురస్కారాలను అందజేయనున్నామని ఏపీ కాపు టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కమతం సుబ్బారావు, కాపు హెల్పింగ్ క్లబ్ గౌరవాధ్యక్షుడు దుద్దుకూరి శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్కుల మెమో, ఆధార్ తదితరాలను 94405 10891 నంబర్‌కు ఈ నెల 15లోపు పంపాలని సూచించారు.

కౌన్సెలింగ్ విధానంలోనే బదిలీలను జరపాలి

నెల్లూరు (టౌన్): కౌన్సెలింగ్ విధానంలోనే ఉపాధ్యాయులకు బదిలీలను నిర్వహించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర నేత మోహన్‌దాస్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్రంలోని అనేక జిల్లాల్లో సిఫార్సు బదిలీలు చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నారని ఆరోపించారు. ప్రక్రియను వెంటనే నిలిపేయాలని డిమాండ్ చేశారు.

పింఛన్ల పంపిణీ నేడు

నెల్లూరు(బారకాసు): నగరంలోని 54 డివిజన్లలో 46,963 మంది లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లను మంగళవారం పంపిణీ చేసేలా కార్యాచరణను రూపొందించామని కమిషనర్ సూర్యతేజ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.20,06,19,000 మేర నగదును లబ్ధిదారులకు వారి ఇళ్ల వద్దే అందజేసేలా చర్యలు చేపట్టామని వివరించారు. పర్యవేక్షణకు 27 మంది నోడల్ అధికారులను నియమించామన్నారు. ప్రక్రియను ఉదయం ఆరు నుంచే ప్రారంభించాలని, పంపిణీ శాతాన్ని ప్రతి గంటకూ తెలియజేయాలని సూచించారు.

భూ ఆక్రమణలపై చర్యలు చేపట్టరూ..

నెల్లూరు(దర్గామిట్ట): రాపూరులో చోటుచేసుకున్న భూ ఆక్రమణలపై చర్యలు చేపట్టాలని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ కోరారు. ఈ మేరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రాన్ని సోమవారం సమర్పించారు. మండలంతో పాటు జిల్లాలో అన్యాక్రాంతమైన భూములపై చర్యలు చేపట్టాలని కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని పలు సబ్‌స్టేషన్లలో మరమ్మతులు, తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించనున్న నేపథ్యంలో వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా మంగళవారం ఉండదని నెల్లూరు టౌన్ ఈఈ శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోస్టల్ కాలనీ, జెడ్పీ కాలనీ, రాజరాజేశ్వరి గుడి తదితర ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని చెప్పారు.

3న నిరసన ప్రదర్శన

నెల్లూరు(బృందావనం): తిరుమల లడ్డూ ప్రసాదంలో జరిగిన అపచారం, హిందూ దేవాలయాలపై దాడులను నిరసిస్తూ హిందూ సమాజ నిరసన ర్యాలీని గురువారం నిర్వహించనున్నామని వీహెచ్‌పీ నేతలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గాంధీబొమ్మ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీని జరపనున్నామని వివరించారు.

మైనింగ్ డీడీగా చంద్రశేఖర్

నెల్లూరు (సెంట్రల్): జిల్లా మైనింగ్ అధికారిగా చంద్రశేఖర్ బాధ్యతలను సోమవారం స్వీకరించారు. నెల్లూరులో పనిచేస్తున్న శ్రీనివాసకుమార్ కృష్ణా జిల్లాకు బదిలీ కాగా, గుంటూరు డీడీగా ఉన్న చంద్రశేఖర్‌ను ఇక్కడ నియమించారు.

హెచ్చరిక నోటీసు

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయదమేమనగా నా క్లయింటు అయిన **షేక్ నాగూరువల్లి తండ్రి రంతుసాహెబ్**, నవాబుపేట, నెల్లూరు సిటి అను వారు **నెల్లూరు 1వ అదనపు జూనియరు సివిల్ జడ్జి వారి కోర్టులో O.S.No.622/2024** గా గల దావాను ప్రతివాదులుపై **1. షేక్ నజిమా భర్త నాగూరువల్లి**, సంతపేట, నిడదవోలు గ్రామం, వెస్ట్ గోదావరి జిల్లా, **2. జడపల్లి విజయమ్మ భర్త వెంకటరత్నం**, లింగంగుంట గ్రామం, అనంతసాగరము మండలం, నెల్లూరు జిల్లా, **3. గోరెమాల కృష్ణవేణి భర్త తిరకాల సుధీర్‌కుమార్**, హరనాథపురం, నెల్లూరు అను వారలపై ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిపై నా క్లయింటు **పర్మినెంట్ ఇంజంక్షన్** కోరుచూ దావా దాఖలు చేసి అందులో **I.A.No.906/2024** పిటిషను ద్వారా **టెంపరరీ ఇంజంక్షను** ఉత్తర్వులు షెడ్యూలు దాఖలా ఆస్తిపై నా క్లయింటు పొంది ఉన్నాడు. కాని ప్రతివాదులు సదరు విషయములు మభ్యపెట్టి ఇతరులకు అక్రమ లావాదేవీలు జరుపుచున్నారని రూఢీగా తెలిసినది. కావున సదరు ఆస్తులపై ఎవ్వరైనను ఎటువంటి లావాదేవీలు జరిపిన యెడల అన్యాక్రాంతములు చేసిన యెడల అవి చెల్లనేరవు. మరియు నా క్లయింటుపై బద్ధగించవు. షెడ్యూలు ఆస్తులపై అక్రమముగా ప్రవేశించిన యెడల నా క్లయింటు తీసుకొనబోవు సివిల్, క్రిమినల్ చర్యలకు బాధ్యత వహించెదరని పత్రికాముఖముగా తెలియజేయడమైనది.

SCHEDULE

Item No. 1:- SPSR Nellore Registration District - Stonehousepet Sub Registration - within the limits of Nellore Municipal Corporation - Vaveletipadu area - Sy.No.250, 251/1 an extent of Ac. 0.36 cents ; Sy No. 261/1 in an extent of Ac. 0.90 cents in Patta No. 349 Sy. No. 250 out of an extent of Ac. 4.80 cents an extent of Ac. 2.00 cents and Patta No. 33 in old Sy. No. 162/1 and an extent of Ac. 0.52 cents ; In Sy. No. 161/1 an extent of Ac. 0.48 cents ; Sy. No. 163/1 an extent of Ac. 0.89 cents ; Sy. No. 165/2 an extent of Ac. 0.34 cents : Patta No. 26, Sy. No. 193/1 an extent of Ac. 1.80 cents : Sy.No. 193/2 an extent of Ac. 2.05 cents ; Sy.No. 194 an extent of Ac. 1.97 cents of New Survey Nos. 261/2, 251/2, 256/1 an extent of Ac. 8.05 cents, Ac. 7.04 cents, Ac. 1.91 cents Northern side Ac. 1.79 cents Out of total extent of Ac. 5.05 cents an extent of Ac. 4.90 cents of land with Layout plan and Country Planning Nellore approved in layout LP No. 175/2007/R.O/Nellore under the name and style NIZAM ESTATE in Plot No. 39 an extent of plot 33.33 ankanams, Plot No. 40 an extent of 33.33 ankanams, totaling to 66.66 ankanams or 533.33 Sq. yards of vacant site bounded by :- **East** : 22 width Layout Road admeasuring 80'-00", **South** : 33 width Layout Road admeasuring 60'-00", **West** : Plot Nos. 37, 38 admeasuring 80'-00", **North** : Plot No. 41 admeasuring 60'-00",

Item No. 2 :- SPSR Nellore District - Gudur District Registration - within the limits of Buja Buja Nellore - Venkatachalam Mandal - Chemudugunta Grama Panchayathi - Kumkumapudi Village - Patta No. 38 - Sy No. 35/1 - an extent of Ac. 5.00 cents, Patta No. 39 Sy. No. 35/2 in an extent of Ac. 5.00 cents, Sy. No. 36/2 an extent of AC. 3.10 cents, Sy. No. 47/4 in an extent of Ac. 16.10 cents of land converted into house plots under Chemudu gunta Panchayathi Layout dt. 21.04.2010 P.R.No. 2/2010 approved layout plan under the name and style MADHURA NAGAR area sold Plot No. 121 in an extent of 30 ankanams or 200.67 Sq. yards of vacant site bounded by :- **East** : 30 width Layout Road admeasuring 36 ft; **South** : Plot No. 122 admeasuring 60 ft;, **West** : Plot No. 93 admeasuring 36 ft;, **North** : Plot No. 120 admeasuring 36 ft;

కుడుముల రవికుమార్, B.Com., B.L.,
న్యాయవాది, నెల్లూరు. సెల్ : 94402 77890